


చంద్రబాబు నేడు కోనసీమకు

చెయ్యేరులో ఏర్పాటైన ప్రజావేదిక



- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సీఎం పాల్గొనే రెండు సభా వేదికలను సిద్ధంచేసిన అధికారులు
- సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్.. పరిశీలించిన డీఐజీ అశోక్‌కుమార్
- 700 మందితో పోలీసు పటిష్ఠ బందోబస్తు
- ఆరు గంటల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు దాట్ల, రాజప్ప, పెందుర్తి

అమలాపురం/ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం లోని రెండు గ్రామాల్లో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జరపనున్న పర్యటనకు అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో భారీ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. హెలిప్యాడ్‌తోపాటు రహదారులు అభివృద్ధి, సీఎం పాల్గొనే రెండు ప్రాంతాల్లో బహిరంగ సభలకు భారీ వేదికలు సిద్ధమయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పూడికతీత పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఆరు గంటలపాటు రెండు గ్రామాల్లో జరిగే సీఎం పర్యటనకు అనూహ్యమైన రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం సీఎం కాన్వాయ్‌తో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు సభావేదికల వద్ద భారీ సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటుచేశారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కూలర్లు, ఏసీలు ఏర్పాటుచేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటివి ప్రజల కోసం సిద్ధం చేస్తున్నారు. అతిథుల కోసం ప్రత్యేక భోజన ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా సీఎం చంద్రబాబు శనివారం నాటి పర్యటనకు సంబంధించి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి ట్రయల్ రన్ ప్రారంభమై సత్తెమ్మతల్లి గుడి మీదుగా చెయ్యేరు గున్నేపల్లి, చెయ్యేరు వరకు నిర్వహించారు. సీఎం పాల్గొనే కార్యక్రమాల వద్ద కూడా ట్రయల్ రన్ నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మంత్రి సుభాష్, సీఎం పర్యటన కమిటీ సారథి పెందుర్తి వెంకటేష్, పలువురు నేతలు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. తర్వాత కొన్ని సూచనలు చేసి, వాటిని సరిదిద్దాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా..

సీఎం చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పులు జరిగాయి. ఆ ప్రకారం.. శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 11.45 గంటలకు కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల నుంచి 12.10 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పరస్పర సంభాషణలు ఉంటాయి. 12.10 గంటలకు బయలుదేరి కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి రోడ్డు మార్గాన బయలుదేరతారు. 12.15 గంటల నుంచి 45 నిమిషాలపాటు పేదల సేవలో కార్యక్రమం బంగారు కుటుంబం(పీ4)లో భాగంగా గ్రామస్తులు కొందరిని దాతలు దత్తత తీసుకుంటారు. అలాగే ఉపాధి పథకం కింద చేపట్టే చెరువు పూడికతీత పనుల పరిశీలన, కార్మికులతో సమావేశం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి చెయ్యేరులో ప్రజావేదిక జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. 1.05 గంటల నుంచి 2 గంటల వరకు సమయాన్ని రిజర్వు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్థానిక ప్రజలతో ప్రజావేదికలో ముఖాముఖి సమావేశమవుతారు. 3.30 గంటలకు ప్రజావేదిక నుంచి బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి వద్దనున్న టీడీపీ కేడర్ సమావేశ వేదికకు చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 5.05 గంటల వరకు కేడర్ సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5.15 గంటలకు హెలిప్యాడ్‌కు నుంచి బయలుదేరి ఆరు గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుంటారు.



బందోబస్తు ఏర్పాట్ల వద్ద డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్

సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారుల సమీక్ష



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సీఎం పర్యటనలో ఎక్కడా లోపాలు లేకుండాఉండేలా అధికార యంత్రాంగాన్ని అంతా అప్రమత్తం చేశామన్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై విధుల, బాధ్యతలు కేటాయించిన అధికారులకు కలెక్టర్ సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పటిష్టమైన ఏర్పాట్ల నడుమ ముఖ్యమంత్రి పర్యటనను, ప్రజావేదిక నిర్వహణ, బంగారు కుటుంబాల దత్తత, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ, ఇతర కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, సర్వశిక్షాభియాన్ సహాయప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మమ్మీ, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ బి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, పీఆర్‌డీఈ పీడీ జైచంద్రగాంధీ, డ్వామా పీడీ ఎస్.మాధుసూదన్ ఉన్నారు.

ముమ్మిడివరంలో ట్రాఫిక్ మళ్లింపు

ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ముమ్మిడివరం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో శనివారం మహిపాలచెరువు-కాట్రేనికోన రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఉదయం 8గంటలనుంచి ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు సాయంత్రం 6 గంటల వరకు ఆ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. కాట్రేనికోన వైపు నుంచి మహిపాలచెరువు వైపునకు వచ్చే వాహనాలను కాట్రేనికోన మండలం ఉప్పూడి రోడ్డులో మునిపల్లి-అనాతవరం రోడ్డుకు మళ్లించారు. కాట్రేనికోన వైపు వెళ్లే వాహనాలను అనాతవరం-మునిపల్లి రోడ్డు వెళ్లేలా ట్రాఫిక్‌ను మళ్లించారు.

భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు: ఎస్పీ

అమలాపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. అమలాపురంలో వివిధ శాఖల పోలీసు అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



అమలాపురంలో పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

‘సుఖీభవ’ అనరే..



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో అన్నదాత సుఖీభవకు రీసర్వే గండం
- గత వైసీపీ ప్రభుత్వంలో తప్పిదాలు అన్నదాతలకు శాపంగా మారిన వైనం
- సర్వే నెంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం నెంబర్ల విధానంలో అడ్డగోలు తప్పులు
- ఒక్కో ఎల్‌పీఎంల్లో పదులకొద్దీ రైతుల విస్తీర్ణాలు ఉంచేసి రీసర్వే
- ఉమ్మడి జిల్లాలో 69,327 మంది పథకానికి దూరమయ్యే ప్రమాదం
- ఇప్పటివరకు 8,82,286 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ పరిశీలన పూర్తి
- మరోపక్క అర్హుల జాబితా ఖరారుకు వ్యవసాయశాఖ దాదాపుగా కసరత్తు పూర్తి
- ఈలోపు రెవెన్యూశాఖ తప్పులు సరిదిద్దకపోతే వేలల్లో నష్టపోనున్న రైతులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి రీసర్వే తప్పులు తల నొప్పులుగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అడ్డగోలు వ్యవహారంతో వేలాది మంది అన్నదాతలు ఇప్పుడు పథకానికి దూరమయ్యే ప్రమాదం నెలకొంది. పూర్వపు సర్వే నెంబర్ల స్థానంలో కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించే క్రమంలో అనేక తప్పులు దొర్లడంతో రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఒక రైతుకు ఒక ఎల్‌పీఎంకు బదులు ఒకే నెంబర్ పదుల కొద్దీ రైతులకు ఇచ్చేసి రీసర్వే పాపాలు చేయడంతో వారి పేర్లు సర్వర్లకు ఎక్కడం లేదు. ఈ తప్పులను సరిచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రెవెన్యూశాఖకు వివరాలు పంపినా కనీసం ఖాతరు చేయకుండా వాటిని పక్కన పడేసింది. మరోవైపు జిల్లాస్థాయిలో అర్హుల జాబితాలను తయారు చేసి వాటిని ప్రభుత్వానికి పంపడంలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమైంది. ఈలోపైనా సమస్య పరిష్కారం చేయాలని రైతులు కోరుతున్నారు.

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం జూన్‌లో అమలు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే డబ్బులతో కలిసి రైతు కుటుంబం యూనిట్‌గా ఏడాదికి రూ.20వేల చొప్పున ఈ పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని సీఎం ఈ సందర్భంగా స్పష్టంచేశారు. అంటే పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6వేలు, మిగిలిన రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పథకం కింద డబ్బులు జమచేయనున్నారు. అందులోభాగంగా పథకం అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కసరత్తు మొదలుపెట్టింది. అందులోభాగంగా జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని జిల్లాల వ్యవసాయశాఖలను ఆదేశించింది. ఈనేపథ్యంలో తమ వద్దనున్న వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా జిల్లాల వారీగా రైతుల వివరాల నివేదికను అధికారులు సిద్ధం చేశారు. వీటిని రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లోని వీఏఏలకు, మండల వ్యవసాయాధికారులకు పరిశీలన కోసం ఇటీవల పంపారు. వెబ్‌ల్యాండ్ వివరాలను సరిచూసి తుది జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో వ్యవసాయాధికారులు, సిబ్బంది ప్రస్తుతం జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. అయితే వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారీలో ఇప్పుడు వ్యవసాయశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వేలాదిమంది రైతులకు సంబంధించి వివరాలు గందరగోళంగా ఉండడంతో వాటిని నమోదు చేయడానికి నిబంధనలు అంగీకరించక ఏంచేయాలో తెలియక వారిని పక్కన పెడుతున్నారు. దీనికంతటికీ గత వైసీపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న రీసర్వే తప్పులే కారణం. అప్పట్లో రీసర్వే పేరుతో ప్రభుత్వం ఎప్పటినుంచో ఉన్న సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబర్ల వ్యవస్థ తీసుకువచ్చింది. ఈవిధానంలో రీసర్వే అనంతరం ఒక రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబరు కేటాయించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో రీసర్వే అడ్డదిడ్డంగా జరగడంతో ఎల్‌పీఎం నెంబర్లు ఒక రైతుకు బదులు అదే నెంబరు పది మందికిపైగా రైతులకు అడ్డదిడ్డంగా కేటాయించేశారు. ఇలా వేలాదిమంది రైతులకు ఒకే నెంబరు ఇచ్చేశారు. అయితే ఇప్పుడు ఈ డేటాను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ తప్పులతో అనేకమంది రైతులు పంట రుణాలు పొందేందుకు, అకాల వర్షాలు, వరదలప్పుడు వచ్చే పంట నష్టపరిహారం తీసుకునేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ఉమ్మడి ఎల్‌పీఎం ఉన్న రైతులకు సైతం ఈ లబ్ధి అందకుండా పోయింది. అప్పటి నుంచి ఉమ్మడి ఎల్‌పీఎంలను విడదీసి ప్రత్యేక నెంబర్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ పెద్దగా జరగడం లేదు. దీంతో వీరంతా ఇప్పుడు సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆధార్ అనుసంధానంలో తప్పులు, మరణించిన వారి పేరుపై భూమి ఉన్నట్టు చూపించడం, సర్వే నెంబర్లల్లో తేడాలు సైతం చాలా ఇబ్బందికరంగా మారాయి.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ వివరాలు ఇలా...

	కాకినాడ జిల్లా	తూర్పుగోదారి జిల్లా	కోనసీమ జిల్లా
ఆన్‌లైన్‌లో నమోదైన రైతులు	2,63,416	2,52,002	3,67,049
పరిశీలన పూర్తయిన రైతులు	2,63,416	2,17,007	3,66,868
తహశీల్దార్లకు పంపిన సమస్యలు	17,021	11,932	40,374
వీటిలో పరిష్కరించినవి	1169	2141	2011
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి	15,852	9791	38,363

సరిచేయకుంటే ఇబ్బందులే..

వాస్తవానికి అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి పొందేందుకు రైతులకు సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా ఉండాలి. ఉమ్మడి ఎల్‌పీఎం ఉంటే అందులో ఉండే రైతులకు లబ్ధి అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకే నెంబరు ఇద్దరు, ముగ్గురు రైతులకు వేసేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేదు. దీంతో ఉమ్మడి ఎల్‌పీఎం నెంబర్లతోపాటు ఇతర రెవెన్యూపరమైన అంశాలను సరిచేసేందుకు వ్యవసాయశాఖ రెవెన్యూ అధికారులకు జాబితా పంపింది. ఎల్‌పీఎం సమస్యలు, సర్వేనెంబర్ల తేడాలు సరిచేయాలని కొంతకాలం కిందట పంపించింది. కానీ ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు దీనిపై అసలు దృష్టిసారించలేదు. దీంతో పథకం అమలుకు గడువు దగ్గరపడ్డా సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదు. వాస్తవానికి కాకినాడ జిల్లాలో ఇంతవరకు 2,63,416 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశారు. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 17,021 మంది రైతుల వివరాలను సరిచేసి పంపించాలని తహశీల్దార్లను వ్యవసాయశాఖ అధికారులు కోరారు. కానీ ఇందులో ఇప్పటివరకు 1,169 మాత్రమే పరిష్కరించారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో 2,52,002 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, 2,17,007 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 11,932 మంది రైతుల వివరాలను సరిచేయాలని రెవెన్యూశాఖకు పంపారు. ఇందులో ఇంతవరకు 2,141మాత్రమే పరిష్కారమయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 3,67,049 మంది రైతుల వివరాలకుగాను 3,66,868 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. ఇంకా 40,374 మంది రైతుల సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉండగా, అందులో 2,011 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా సరిచేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. లేదంటే అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్న అన్నదాతలకు ప్రయోజనం దక్కే అవకాశం ఉండదు.

కసరత్తు మొదలు..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 69,327 మంది రైతులు పథకానికి దూరం కానున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో వివిధసాకులతో రైతు భరోసా కింద లబ్ధిపొందే వారి సంఖ్యను అడ్డంగా కుదించేశారు. ఏటేటా వివిధ నిబంధనల పేరుతో లబ్ధిదారులను తగ్గించేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం సుఖీభవ పథకానికి ఎలాంటి కోతలు లేకుండా వెబ్‌ల్యాండ్ ఆధారంగా కుటుంబం యూనిట్‌గా ప్రతి రైతుకి పథకం అందించేలా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్రస్థాయి నుంచి పంపిన వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా జాబితాను తయారు చేసి రెండు రోజుల్లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి ప్రభుత్వానికి జాబితా పంపనున్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాలను మళ్లీ జిల్లాలకు పంనుంది. ఈ జాబితాలను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రదర్శించి త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆతర్వాత తుది జాబితా రూపొందించి పథకం డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

నేటి నుంచి కాకినాడ జిల్లాలో.. మంత్రి నాదెండ్ల పర్యటన

పిఠాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం నుంచి మూడురోజులపాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారికంగా కాకినాడ జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందింది. 31వతేదీ మధ్యాహ్నం విజయవాడ నుంచి బయలుదేరి సాయంత్రం 4.30గంటలకు పెద్దాపురం చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి 5గంటలకు బయలుదేరి కాకినాడలోని ప్రైవేటు హోటల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. జూన్ 1వతేదీ ఉదయం కాకినాడనుంచి బయలుదేరి 9గంటలకు పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో దివీస్ ల్యాబ్స్ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ప్రారంభిస్తారు. 10గంటలకు నూకాలమ్మ గుడి వీధిలోని చౌకధరల దుకాణంవద్ద రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించి సకలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో పెట్రోల్‌బంకు ప్రారంభిస్తారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొననున్నారు. రాత్రికి మళ్లీ కాకినాడ హోటల్‌కు చేరుకుని రాత్రిబస చేస్తారు. 2వ తేదీ ఉదయం 8గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.

రేపు డెల్టా కాలువలకు నీరు విడుదల


ధవళేశ్వరం, మే30(ఆంధ్రజ్యోతి):కాటన్ బ్యారేజ్‌నుంచి ఖరీఫ్ పంటకు ఆదివారం డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. రబీ తర్వాత తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలను మూసివేసి పంట కాలువల్లో తూడు తొలగింపు, పూడికతీత తదితర క్లోజర్ పనులు చేపట్టి ఖరీఫ్‌లో రైతులకు సాగునీరు అందించడానికి కాలువలను సిద్ధం చేశారు. ఆదివారం పూజలు నిర్వహించి హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు.

యోగాతో ఆరోగ్యవంతమైన జీవన విధానం: కలెక్టర్

అమలాపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యకరమైన జీవన విధానానికి బాటలు వేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని మన రాష్ట్రంలో ప్రధాని మోదీ నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పదివేల కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో అధికారులు, బ్యాంకర్లను సమన్వయం చేసుకుని రాయితీలతో లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకు ఉచితంగా సౌర విద్యుత్ యూనిట్లను స్థాపించాలని, బీసీ వినియోగదారులకు కేంద్రం ఇచ్చే రాయితీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.20వేల రాయితీ అందిస్తుందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, విద్యుత్ సరఫరా, ఇసుక సరఫరా, దేవాలయాల దర్శనాలు, మున్సిపల్ సర్వీసులు వంటి అంశాల్లో సంతృప్తి స్థాయిలు పెంచాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరితాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని, ఆ దిశగా గ్రీనరీని పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజాబాబు, డీఎస్డీవో పి.సురేష్‌కుమార్, ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్



మంచు కొండ

చూసే కళ్లు ఉండాలి కానీ మన్యంలో ఎటు చూసినా ప్రకృతి అందాలే కనిపిస్తాయి. ఇక్కడ మండు వేసవిలోనూ అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు ఉదయం, సాయంత్రం వేళల్లో మంచు పడుతోంది. వర్షం వేళ మేఘాల మంచు ముసుగు పచ్చటి కొండలను తాకుతోంది. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని ఫోర్‌బై డ్యాం వద్ద ఈ దృశ్యం చూపరులను కట్టిపడేస్తోంది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)



అరుణ కిరణం

పగలాంతా తీక్షణ కిరణాలతో ప్రజలను బెంబేలెత్తించిన వెలుగుల రేడు సాయం సమయాన మబ్బులమాటుకు వెళ్తున్నాడు. అస్తమించే సూర్యుని అరుణ కిరణాలు తాకి మబ్బులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటలో శుక్రవారం సాయంసంధ్యవేళ కనిపించిన ఈ మనోహరమైన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



పొగాకు ఏ రూపంలో తీసుకున్నా అది మనిషి పతనానికి దారితీస్తుంది. తద్వారా అనారోగ్య కారణాలు ఏరికోరి తెచ్చుకున్న వారవుతారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో రుగ్మతలు పొంచి ఉంటాయి. పొగాకు ఉత్పత్తులు కొనుక్కుని, వాటిని వాడాక రోగాలను కోరి తెచ్చుకోవడమే అవుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధుల బారిన పడక తప్పదు. నేడు జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- పొగ తాగితే ఎన్నో దుష్ఫలితాలు
- సరదాగా ప్రారంభం... పొంచి ఉన్న ప్రమాదం
- ఏరికోరి రోగాలు తెచ్చుకోవడమే అంటున్న వైద్యులు
- ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులకు కారణం
- నేడు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ప్రాణాంతకం ధూమపానం

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పల్లెలు, పట్టణాలతో సంబంధం లేకుండా పొగతాగేవారు చాలాచోట్ల ఉన్నారు. కొందరు దీన్ని ఒకప్పుడు హుందా, దర్పానికి ఫ్యాషన్ అనుకునేవారు. ఇది కాస్త శ్రుతిమించి అలవాటుగా మారినవారు మానలేక అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. సరదాగా మొదలుపెట్టిన సిగరెట్ కాలక్రమేణా కొందరిని ఖరీదైన మత్తు పదార్థాలవైపు ఉసిగొల్పుతోంది. విజ్ఞానాంశాల్లో యువకులు పోటీపడి ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. ఏది మంచి, చెడు అనే విషయం అర్థం చేసుకుంటున్నారు. అన్నీ తెలిసి కూడా కొందరు పొగాకు సేవనానికి బానిసలవుతున్నారు. కొందరు ఈ రొంపి నుంచి బయట పడలేకపోతున్నారు.

కోట్లలో బానిసలు

ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య కోట్లలో ఉంది. దీనివల్ల పక్కనుండే వారు కూడా ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) దీనిపట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. చాలా మంది పొగ తాగకుండా కాలకృత్యాలు తీర్చుకోరని ఓ సర్వే చెప్తోంది. ఇందులో మహిళలు కూడా ఉండడం విశేషం. ఇలా పొగ తాగడానికి ఎన్నో సాకులు చెప్తూ ప్రతిరోజూ ఒక్కో వ్యక్తి సగటున 150 గ్రాముల పొగాకును వారికి తెలియకుండానే శరీరంలోకి తీసుకెళ్తున్నారు. భారతదేశ స్థూల ఆదాయంలో



ఎగుమతుల ద్వారా అధిక ఆదాయం పొగాకు ఉత్పత్తుల ద్వారా లభిస్తోందని, ఇవే ఉత్పత్తులు దేశ మానవ వనరులను నాశనం చేస్తుందని స్పష్టం చేసింది. ప్రధానంగా 18 నుంచి 30 ఏళ్ల యువకులు సిగరెట్, పొగాకు అనుబంధ ఉత్పత్తులను తీసుకుంటూ చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సత్ఫలితాలు కనిపించట్లేదని లేదని వివరించింది.

చెడు అలవాట్లకు మార్గం

కుటుంబ వాతావరణం పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూలి పనికి వెళ్తూ వెంట పిల్లల్ని తీసుకెళ్తుంటారు. తండ్రి ఖాళీ సమయంలో ఓ చుట్ట వెలిగిస్తాడు. దీన్ని గమనించిన పిల్లలు కొంత కాలానికి అదే ప్రయత్నం చేస్తారు. కానీ పిల్లలు చేస్తున్న ఆ పనిని తల్లిదండ్రులు అడ్డుకోరు. ఇదే అదనుగా వారు పెరిగి పెద్దవారయ్యాక ఖరీదైన సిగరెట్ల జోలికి వెళ్తారు. కళాశాలల్లో సిగరెట్‌లో ఉండే పొగాకు లాంటి పొడి (గంజాయి)ని వేసి దమ్ము పీల్చుతారు. తొలి ప్రయత్నంలో కొంతమంది యువకులు తేలికపాటి మత్తుకు చేరువవుతున్నారు. వక్కపొడి మాదిరిగా కనిపించే గుట్కా తినడానికి ఎక్కువ మంది యువకులు ఆసక్తి చూపిస్తున్నారు. వీటి విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా మార్కెట్లో బ్లాక్‌లో ఇవి దండిగా లభిస్తున్నాయి. పిల్లాడు సరదాగా సిగరెట్ తాగుతున్నాడని, తెలిసి ఊరుకుంటే, ఆ తర్వాత వచ్చే వ్యాధులను అరికట్టడానికి లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పొగాకు బానిసలైన వారికి ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుట్కా, పాన్‌మసాలా, జర్దా కిల్లీ తీసుకోవడం ద్వారా నోటి, ప్లీహ కేన్సర్లు వస్తాయని, అవి మనిషి శరీరంలోకి అంత తేలిగ్గా ప్రవేశించవని, ప్రవేశిస్తే ఎన్ని మందులు తీసుకున్నా నిష్ప్రయోజనమేనని వారు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..

సరదాగా ధూమపానం చేస్తే చాలు బానిస అవుతారు. పొగాకులోని నికోటిన్ అత్యంత వేగంగా రక్తంలోకి వెళ్లి ఏడు సెకన్లలోనే మెదడుకు చేరుతుంది. హెరాయిన్, కొకైన్, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాల మాదిరిగానే పొగాకులోని నికోటిన్‌కు కూడా బానిసలుగా మార్చు



కునే గుణం ఉంటుంది. పొగాకును నిత్యం వాడడం వల్ల తీవ్ర ప్రమాదకారిగా మారుతుంది. పొగాకులోని నికోటిన్ రక్తనాళాలను పాడుచేయడంతో పాటు గుండెపోటుకు గురిచేస్తుంది. క్షయ, శ్వాస, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడేలా చేస్తుంది. 40శాతం వరకు కేన్సర్ వ్యాధులు పొగాకు వాడకం వల్లే వస్తున్నాయి. 90శాతం నోటి కేన్సర్లు పొగాకు సంబంధిత వాడకంతో సంభవిస్తున్నాయి. ధూమపానం చేసేవారి ఇళ్లల్లో పిల్లలకు వినికిడి తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. మధ్య వయసులో ఉండి బీపీ, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు ధూమపానం చేస్తే పదినుంచి 15 ఏళ్లకు ముందే మరణిస్తారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.



పొగతో వ్యాధులు

పొగాకు పొగ పీల్చగానే నేరుగా అది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుంది. ముక్కుభాగంలో ఉండే అల్వియోలై అనే గాలి గది 28వ అంతస్థుగా ఉంటుంది. అక్కడే గాలి మార్పిడి జరుగుతుంది. అంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ శరీరానికి అంది మలినమైన కార్బన్‌డైఆక్సైడ్ మార్పిడి అల్వియోలై అనే గాలి గదిలోనే జరుగుతుంది. కానీ పొగలో ఉండే కార్బన్‌మోనాక్సైడ్, సైనేడ్ వంటి విష పదార్థాల వల్ల ఆ గాలి గది స్వరూపమే మారిపోతుంది. వాస్తవానికి అక్కడ హిమోగ్లోబిన్ అనే వాహనం మీద ఆక్సిజన్ చేరి శరీరంలోని అన్ని కణాలకు అందాలి. కానీ పొగాకులోని విష పదార్థాల్లో ఉండే కార్బన్ మోనాక్సైడ్ హిమోగ్లోబిన్‌తో గాఢమైన బంధాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. దాంతో రక్తంలోని హిమోగ్లోబిన్‌కు ఆక్సిజన్‌ను మోసుకుపోయే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శరీరంలోని అన్ని కణాలు కార్బన్‌మోనాక్సైడ్‌తో విషపూరితమై ఎన్నో వ్యాధులకు దారితీస్తుంది. దీనివల్ల కొద్ది దూరం కూడా మనిషి నడవలేని పరిస్థితి. కదిలితే నీరసం.. నడిస్తే ఆయాసం. ఎడతెరపి లేకుండా వచ్చే విపరీతమైన దగ్గు పొగాకులో ఉండే ఆక్రోలిన్ అత్యంత విష పదార్థం కారణంగా కలుగుతుంది.



అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్పొరేషన్ ఇంజనీరింగ్ వర్కర్స్

మా సమస్యలు పట్టవా!

- 24 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేదు
- స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

కార్పొరేషన్ (కాకినాడ), మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా తమ బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల శివ పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాకినాడ స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. 24 రోజులుగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించకపోగా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కింది స్థాయి అధికారులు నామమాత్రపు చర్చలకు పిలిచినప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవట్లేదన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు తక్షణం వేతనాలు పెంచడంతో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ విభాగం పనులు నిలుపుదల చేసి నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీధర్, యూనియన్ అధ్యక్షుడు ఏకల శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంభుప్రసాద్, బత్తుల సత్యనారాయణ, పాలిక సత్యనారాయణ, మద్దూరి వీరభద్రరావు, జాడ అప్పలరావు, పి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం రాక

- అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలకు అరుణ్ సావో హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావో శనివారం రాజమహేంద్రవరం రానున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో హోటల్ మంజీరలో జరిగే అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు మంజీర హోటల్‌లో అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు వై.జంక్షన్ నుంచి ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొంటారన్నారు. అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని ఆమె చరిత్రపై ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీనంతోష్ తెలిపారు.

2న కాకినాడ వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వికాస కార్యాలయంలో జూన్ 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ మేనేజర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు రాజమహేంద్రవరంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలను ఆదివారం రాజ మహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని రత్న ప్యాలెస్ దగ్గర గల ఐరన్ అండ్ హార్డ్ వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహిస్తున్నట్టు సంఘం కార్యదర్శి జి.రవికుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి నలుగురు విజయవాడలో జూన్ 7, 8 తేదీల్లో జరిగే సీనియర్ మెన్ రాష్ట్ర చదరంగం పోటీలకు మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఏపీ చెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9848374133 నెంబరును సంప్రదించాలని రవికుమార్ కోరారు.

సాగుకు సమాయత్తం

కర్ర పెండలం దుంప నాట్లు సీజను ప్రారంభం



రైతులు సేకరించిన నాణ్యమైన విత్తన కర్ర

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్ర పెండలం దుంప సాగుకు మెట్ట ప్రాంత రైతులు సమాయత్తమయ్యారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది మే రెండో పక్షం నుంచే వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, రంగంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, కిర్లంపూడిల్లో భూములను దుక్కి దున్నడం, నారుమడులకు పళ్లాలు కట్టడం, నాణ్యమైన కర్ర పెండలం దుంప కర్ర, విత్తనాల సేకరణ వంటి పనుల్లో రైతులు ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఏటా జూన్ రెండో వారం నుంచి దుక్కి దున్నడం, నారుమడులు వేయడం చేసేవారు. అయితే ఈ ఏడాది వాతావరణం కర్ర పెండలం సాగుకు పూర్తి అనుకూలంగా మారడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. కాగా సగ్గు బియ్యం మిల్లర్ల నుంచి గిట్టుబాటు ధర లభించట్లేదనే కారణంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం కాలక్రమేణా తగ్గిపోతోందని మెట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లాభదాయకంగా ఉన్న పామాయిల్ తదితర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగా దుంప దిగుబడులు ప్రతి సీజనుకూ తగ్గతూ సగ్గుబియ్యం మిల్లులు వరుసగా మూతబడుతున్నాయి. ఐదేళ్ల క్రితం జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో కర్ర పెండలం సాగు జరగ్గా గత ఏడాది కేవలం పది వేల ఎకరాలకు దిగజారింది. ఈ ఏడాది సాగుకు వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉన్నప్పటికీ సగ్గు బియ్యం ఉత్పాదక వ్యయం పెరుగుదల, మార్కెట్లో ధరల తగ్గుదల వంటి అంశాలు కర్ర పెండలం సాగు పెరిగేందుకు ఎంత మాత్రం దోహదపడట్లేదని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. ఈ కారణంగా ప్రతి సీజన్లోనూ మిల్లులు మనుగడ సాగించలేకపోతున్నాయని చెప్పారు.



నారుమడులు (పళ్లాలు) కట్టిన దృశ్యం

మేలైన వైద్య సేవలందించండి

- తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి




వైద్య సదుపాయాలు, సేవలపై వైద్యులను ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రాజానగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి వైద్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గల మానసిక చికిత్స కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆ విభాగంలో చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు పాటిస్తే త్వరగా కోలుకోవచ్చని రోగులకు సూచించారు. చికిత్స పొందుతున్న వారి వివరాలు, అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తామని చెప్పారు.

రక్షణకు వేద్దాం 'టూ స్టెప్స్'

- వాట్సా‌ప్‌లో మార్చుకోవాల్సిన సెట్టింగ్‌పై పోలీసుల అవగాహన
- సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని సూచన

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన ఓ యువకుడికి ఇటీవల వాట్సాప్ ద్వారా ఫోన్ వచ్చింది. హిందీలో మాట్లాడటంతో ఫోన్ కట్ చేశాడు యువకుడు. వెంటనే రూ.5 వేలు పంపాలని లేకపోతే నీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లందరికీ నీ నగ్న ఫొటోలు పంపుతానని బెదిరింపులు వచ్చాయి. భయంతో పోలీసులను ఆశ్రయించాడు యువకుడు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుంటే మరికొంతమంది భయంతో సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు డబ్బులు పంపుతున్నారు. ఇంతకీ మనం ఫోన్‌లో ఉండే కాంటాక్ట్ లిస్టులో ఉన్న వివరాలు అవతలి వ్యక్తికి ఎలా వెళ్తాయే తెలుసా? వాట్సాప్‌లో ఉన్న ఓ సెట్టింగ్ ఆన్ చేసుకోకపోవడమే అందుకు కారణం. ఇదే సైబర్ దొంగలకు వరంగా మారింది. వాట్సాప్‌లో టూ స్టెప్ పిన్ యాక్టివేట్ చేసుకోని యువతను టార్గెట్‌గా చేసుకుని ఫోన్ కాల్ చేసి వారి కాంటాక్ట్ లిస్టులో వ్యక్తులకు మార్ఫింగ్ ఫొటోలతో బెదిరింపులకు దిగుతున్నారు దుండగులు. అయితే సెట్టింగ్‌లను మార్చుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



సెట్టింగ్‌ను మార్చుకోండిలా...

- తొలుత వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లండి
- ఖాతాపై క్లిక్ చెయ్యండి
- టూ స్టెప్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి
- మీ పిన్‌ను నమోదు చెయ్యండి
- మీ ఈమెయిల్ చిరునామా నమోదు చేసి సేవ్ చేయండి

అవగాహన ఉండాలి

ప్రతీ ఒక్కరూ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలి. వాట్సాప్‌ను వినియోగించే ప్రతీ ఒక్కరూ టూ స్టెప్ వెరిఫికేషన్ చేసుకోవాలి. టూస్టెప్ పిన్ నమోదు చేసుకున్న వాట్సాప్‌ను హ్యాక్ చేయాలంటే వాట్సాప్ టూ స్టెప్ వెరిఫికేషన్ అడుగుతుంది. ఓటీపీ లేకుండా వాట్సాప్ హ్యాక్‌చేయడం కుదరదు.



ప్రత్తిపాడు సీఐ బి. సూర్యఅప్పారావు

రైలు టిక్కెట్ల బుకింగ్‌లో ఇక్కట్లు

ఐఆర్‌సీటీసీ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్యలు

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్(ఐఆర్‌సీటీసీ) వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లు ఇటీవల కొద్దిరోజులుగా తరచూ క్రాష్ అవుతుండడంతో యూజర్లను లాగిన్ కానీయడం లేదు. ఒక్కో సమయంలో లాగిన్ అయినా టిక్కెట్లు బుకింగ్ చేసుకునేందుకు సాంకేతిక సమస్య ఏర్పడుతుంది. జనరల్ టిక్కెట్ల బుకింగ్‌లోనే ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో చుక్కలు చూపిస్తుందని పలువురు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య లేదని యూజర్లు వాపోతున్నారు. ప్రధానంగా మీ ఇంటర్నెట్ కనెక్టివిటీని చెక్ చేసుకోమంటూ ఎర్రర్ సందేశం వస్తుంది. మొబైల్ ఇంటర్నెట్, వైఫై, బ్రాడ్ బ్యాండ్ సేవలు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమస్య ఉత్పన్నవుతుందని పలువురు వాపోతున్నారు.

ఇతర యాప్‌ల దోపిడీ

ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్ పోర్టల్ రైల్వే టిక్కెట్ల బుకింగ్‌కు మొరాయిస్తుండడంతో యూజర్లు గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా అదనపు సర్వీసు చార్జీలు చెల్లించి టిక్కెట్లు బుకింగ్ చేసుకోవాల్సివస్తుంది. ఇదే సమయంలో టిక్కెట్ల చార్జీపై అదనంగా రూ.50 చెల్లిస్తే ఒక వేళ క్యాన్సిలేషన్ చేసుకున్నా ఫుల్ రిఫండ్ చేస్తామంటూ వల విసురుతున్నారు. అదే ఏసీ టిక్కెట్లకు, త్రీటైర్ టిక్కెట్లకు అయితే రూ.127, సెకండ్ ఏసీ అయితే రూ.177, ఫస్టు ఏసీకి రూ.295 చెల్లిస్తే త్రీటైర్ టిక్కెట్టు క్యాన్సిల్ చేసుకున్నా పూర్తి రిఫండ్ చేస్తామంటున్నాయి. ఈ విధంగా ప్రయాణికులను ఇతర యాప్‌లు దోపిడీ చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

'స్పేసెస్' డిగ్రీ కళాశాలకు అటానమస్ స్టేటస్



స్టేటస్ ఆర్డర్‌ను చూపిస్తున్న విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థలైన స్పేసెస్ డిగ్రీ కళాశాల యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నుంచి స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) పొందినట్టు కళాశాల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. ఈ హోదా దశాబ్ద కాలానికి వర్తిస్తుందని, ఈ హోదా సొంతం చేసుకోవడంతో కళాశాలలోనే సొంతంగా కోర్సులు రూపొందించుకుని, సిలబస్ అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహించి ఫలితాలు వెల్లడించే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం ఉపాధి, స్వావలంబన అనే ధ్యేయంతో పనిచేస్తున్న ఈ విద్యాసంస్థకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని విజయ్‌ప్రకాష్ తెలిపారు. స్వయం ప్రతిపత్తి ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చే దిశగా కట్టుబడి ఉన్నట్టు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సీహెచ్ వి.కె.నరసింహారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది సహా ఈ ఘనత సాధనలో భాగస్వామ్యైన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి దాడి చేసి గాయపర్చిన సంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జి.జి. ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ షాన్‌బాషా ఈ నెల 28వ తేదీన పట్టణంలో సాయి చికెన్ షాపు వద్ద ఉండగా సాయి, రాజేష్, చందులు వచ్చి ఘర్షణ పడి దాడి చేశారు. కాలర్ పట్టుకుని కొట్టి గాయపర్చారు. గాయపడిన షాన్ బాషాను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు షాన్ బాషా ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

మరో ఘటనలో..

వ్యక్తిని కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జి.జి. ప్రకాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. కొవ్వూరు పట్టణానికి చెందిన కొనకళ్ళ అంజి ఈనెల 28వ తేదీన చికెన్‌షాపు శివ ఇంటిలో శుభకార్యానికి వెళ్లాడు. భోజనాలు వడ్డించే సమయంలో షాన్‌బాషాకు, అంజికి మధ్య వివాదం ఏర్పడింది. ఈ ఘటనలో అంజికి గాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అంజి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

కలెక్టర్ రకం.. చిలుక ఆకారం..

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని ఓ మామిడి రైతు తోటలో మామిడికాయ వినూత్న ఆకారంలో కనిపించింది. స్థానిక రైతు గొనగాల గోపి మామిడి తోటలో కలెక్టర్ రకం మామిడి చెట్టు నుంచి దిగుబడికొచ్చిన ఈ మామిడికాయ చిలుక ఆకారంలో శుక్రవారం ప్రత్తిపాడు మార్కెట్‌కు రావడంతో దానిని ఆసక్తిగా తిలకించారు.



చిలుక ఆకారంలో ఉన్న మామిడికాయ

రత్నగిరిపై యోగాంధ్ర

హాజరైన కాకినాడ జిల్లా జేసీ, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి

అధిక సంఖ్యలో పాల్గొన్న ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, భక్తులు, ఉద్యోగులు



అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఉదయం 8గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా నూతనుత్తేజం పొందుతారని పేర్కొన్నారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంప్రదాయం అమూల్యమైన సంపదగా యోగాను అభివర్ణించారు. చిన్నారులకు ఏకాగ్రత కల్పించడంలోను, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి యోగాసనాలు ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. దేవస్థానం వ్రతపురోహితులు, నాయిబ్రాహ్మణులు, శానిటరీ సిబ్బందితో పాటుగా సుమారు 1000 మంది యోగసనాలను వేశారు.

సత్యదేవుడి సన్నిధిలో

పాట్నా హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ రాయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.



పాట్నా హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒక దాత రూ1,00,116లు విరాళంగా సమర్పించారు. బెంగుళూరుకు చెందిన నడింపల్లి ఎస్‌వి ఎస్‌రాజు, నాగదేవి దంపతులు ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ఘనంగా చండీహోమం

సత్యదేవుడి ఆలయ రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కార్యకర్తను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నిరసన సమయంలో... అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): తనను అన్యాయంగా విధుల్లో నుంచి తొలగించారని నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త అస్వస్థతకు గురైంది. అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటువంటి సమాచారం లేకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించాని ఈనెల 27 నుంచి కాకినాడ జిల్లా శంఖవరం ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పద్మ నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. అయితే శుక్రవారం ఉదయం యాథావిధిగా నిరసనకు కూర్చున పద్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో యూనియన్ సభ్యులు అంబులెన్స్‌లో రౌతులపూడి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుందని, ఉద్యోగం ఏమైపోతుందోనని ఆవేదనతో 4 రోజులుగా ఏమి తినకపోవడంతో నీరసించిపోయినట్లు యూనియన్ సభ్యురాలు బుల్లెమ్మ తెలిపారు. వెంటనే పద్మను విధుల్లోకి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కాపు పోరాట యోధుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో రంగా విగ్రహం చేతులు విరగ్గొటడంపై జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఆందోళనకారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన పి.శ్రీకాంత్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకుడి అరెస్ట్

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో రహదారి మధ్యన నిలబడి ఇతర వాహనాలకు ఆటంకం కలిగించిన యువకుడిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల టౌన్‌కు చెందిన ఇస్మాయిల్ కాకినాడ జిల్లా జగ్గంపేటలో గురువారం రాత్రి బాగా మద్యం తాగి రోడ్డు మీదకు వచ్చాడు. వాహనాలను అడ్డుకుని ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. దీనిపై సమాచారం రావడంతో పోలీసులు అతడిని అరెస్టుచేశారు.

అన్నవరం దేవస్థానం ఏఈవోకు విభాగం మార్పు

ఈవో షోకాజు నోటీసులు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి శ్రీపుష్పయోగం రోజున మహిళా భక్తురాలిపై ఆలయ ఏఈవో కొండలరావు అసభ్యంగా ప్రవర్తించారని సీఎంవోకు ఓ భక్తుడు ఫిర్యాదు చేసిన సంఘటనపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా కొండలరావును ఆలయ విభాగం నుంచి గార్డెన్ విభాగానికి మార్చి పాలంకి జగ్గారావుకు ఆలయ ఏఈవో బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పాటుగా కొండలరావుకు షోకాజు నోటీసులు జారీ చేసి 5 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలలో కొండలరావు రెండోసారి షోకాజు నోటీసులు అందుకోవడం కొసమెరుపు. అలాగే వచ్చేనెలాఖరికి పదవీ విరమణ చేయనున్నారు.

లారీని ఢీకొన్న ఐషర్ వ్యాన్

అక్కడికక్కడే డ్రైవర్ మృతి



నుజ్జునుజ్జు అయిన ఐషర్‌వ్యాన్



క్యాబిన్‌లో మృతిచెందిన డ్రైవర్

దేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా ఐషర్ గూడ్స్‌వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాజమహేంద్రవరం వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఐషర్‌వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో ముందు క్యాబిన్ భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడి కక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ వాహనం తమిళనాడుకు చెందినదని గుర్తించినట్టు చెప్పారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మార్చురీకి తరలించినట్టు ఆయన తెలిపారు. అయితే మరణించిన డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం బొల్లువారి వీధికి చెందిన బొల్లు రాజేష్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం, వన్నెపూడి జాతీయ రహదారిపై వస్తుండగా రాజేష్ మోటార్‌బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైందా లేదా ఏదైనా వాహనం ఢీకొందా అనే విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన రాజేష్‌ను ప్రత్తిపాడు ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన రాజేష్

అనాతవరంలో తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మే 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం శివాలయం వీధికి చెందిన సుదర్శనం వెంకటసీతారామాచార్యుల ఇంట్లోకి తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో చుట్టుపక్కలవారు, ఇంటి యజమాని భయభ్రాంతులకు గురయ్యారు. ఆ ఇంటి షెడ్డుపైకి తాచుపాము చేరి 4 రోజులుగా నివాసం ఏర్పరుచుకుంది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం అతడు తాచును చాకచక్యంగా బంధించి తీసుకెళ్లాడు. పామును అటవీ ప్రాంతంలో వదులుతానని వర్మ తెలిపాడు.



తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

గంజాయితో ఆరుగురి అరెస్టు

15 కిలోల గంజాయి, 2 ద్విచక్రవాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మోతుగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): సీలేరు నుంచి గంజాయిని తరలిస్తున్న ఆరుగురు నిందితులను మోతుగూడెంలో ఎస్‌ఐ సాదిక్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లు పట్టుకున్నారు. వారి నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటకు చెందిన ఎన్.హరికృష్ణ, పిడుగురాళ్లకు చెందిన కె.నవీన్, ఎస్.రాజేష్, తిరువూరుకు చెందిన కె.సిద్ధు, సీహెచ్ సురేష్‌తోపాటు మరో వ్యక్తి సీలేరు నుంచి తెలంగాణకు గంజాయిని తీసుకెళ్తున్నారు. మోతుగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం దొరికారు. 15కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.



గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

విశాల్ మార్ట్‌లో తప్పిన పెను ప్రమాదం

గ్యాస్ ఒత్తిడితో పేలిన ఏసీ

టెక్నీషియన్‌కు తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): విశాల్ మెగా మార్ట్‌లో పెను ప్రమాదం తప్పింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలా చెరువు సమీపంలో విశాల్ మార్ట్‌ని గురువారం ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో మూడో ఫ్లోర్ వెనుక భాగంలో 8.5టన్నుల ఏసీకి సంబంధించిన ఔటర్ యూనిట్ (బ్లోయర్)లోని గ్యాస్ ఒత్తిడిని టెక్నీషియన్ చెక్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ ధాటికి టెక్నీషియన్ మూడో ఫ్లోర్ నుంచి ఇనుప మెట్లపై రెండో ఫోర్‌లోకి పడిపోయాడు. చేతులు, కాలి తీవ్ర గాయాలయ్యాయి. తొలుతగా ప్రభుత్వాస్పత్రికి తర్వాత మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే 4 ఫ్లోర్లలోనూ నిండుగా సరుకు ఉండడంతోపాటు ప్రమాదం జరిగిన సమయంలో మార్ట్‌లో జనం, సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు. లోపలికి మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. కాగా ఏసీ టెక్నీషియన్ ఎప్పుడు వచ్చి చెక్ చేసుకుంటున్నాడో తమకు తెలియదని మార్ట్ సిబ్బంది చెప్పడం గమనార్హం. అయితే ఆస్తి నష్టం అంచనా వేయాల్సి ఉంది.



మార్ట్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

అరగుండు చేయించుకున్న జగన్ అభిమాని

తూర్పుగోదావరి జిల్లా ఊనగట్లలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి

చాగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): స్నేహితులకు ఇచ్చిన మాట ప్రకారం జగన్ ఓటమి చెందినందుకు ఆయన అభిమాని అరగుండు చేయించుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలో ఈనెల 25న ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలివి. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన వీరవల్లి శివ వైసీపీ కొవ్వూరు నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్‌గా వ్యవహరించేవాడు. ఎన్నికల సమయంలో వైసీపీ గెలుపు ఖాయమని చాలా ధీమా వ్యక్తం చేశాడు. జగన్ ఓడిపోతే అరగుండు చేయించుకుంటానని పందెం కాశాడు. దీంతో జగన్ ఓటమి చెంది సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 25న ఆదివారం సాయంత్రం అతడు అరగుండు చేయించుకుని ఊనగట్ల సెంటర్‌లో కొద్దిసేపు తిరిగాడు. కాగా ఈ విషయం బయటకు పొక్కలేదు. శుక్రవారం ఈ విషయం తెలియడంతో ఆంధ్రజ్యోతి అతడిని పలకరించింది. ముఖ్యమంత్రిగా జగన్ అమలు చేసిన పథకాలు ఆయనను గెలిపిస్తాయని నమ్మానని, కానీ ప్రజలు వైసీపీని తిరస్కరించారని, జగన్ ఓడిపోవడంతో స్నేహితులకు ఇచ్చిన మాట కోసం అరగుండు చేయించుకున్నానని వీరవల్లి శివ బదులిచ్చాడు.



అరగుండుతో వీరవల్లి శివ

సమస్యల పరిష్కారానికి కృషి: బండారు
రావులపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పైపులైను పనులకు శంకుస్థాపన
అమలాపురంరూరల్,మే30(ఆంధ్రజ్యోతి): రెడ్డిపల్లిలో రూ.4లక్షలతో వాటర్ పైపులైను పనులకు శుక్రవారం సర్పంచ్ కరాటం రత్నప్రసన్న శంకుస్థాపనచేశారు. ఎంపీటీసీ సత్తి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి ప్రకాష్, కార్యదర్శి గణపతి, కరాటం ప్రవీణ్, సత్తి సూరిబాబు, నల్లా సతీష్, రాజులపూడి మహేష్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



సీఎం పర్యటన ఏర్పాట్లు సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బుచ్చిబాబు, సీఎం పర్యటన కన్వీనర్ పెందుర్తి వెంకటేష్ తదితరులు

ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముమ్మిడివరం నియోజకవర్గ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్టు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంత్రి సుభాష్, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, అదనపు ఎస్పీ ప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ముఖ్యమంత్రి పర్యటనల కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా అధికారులు, పోలీసు అధికారులతో కూడిన బృందం శుక్రవారం సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్, చెయ్యేరులోని ప్రజావేదిక, చెరువు పూడికతీత పనులు, గున్నేపల్లిలోని ముఖ్యమంత్రి పార్టీ కేడర్‌తో సమావేశమయ్యే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పర్యటనకు సంబంధించి అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ఎటువంటి లోపాలకు తావివ్వకుండా అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. వారికి పలు సూచనలు జారీ చేశారు. పటిష్టమైన ఏర్పాట్ల నడుమ సీఎం పర్యటనను, ప్రజావేదిక, బంగారు కుటుంబాలు, దత్తత, సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. మంత్రి వెంట పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రెవెన్యూ, సర్వశిక్షాభియాన్, ఏపీ, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే యోగాంధ్ర లక్ష్యం

● జాయింట్ కలెక్టర్ నిషాంతి



ఎంపీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే యోగాంధ్ర లక్ష్యమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంపీడీవోలతో ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల స్థాయిలో యోగాంధ్రకు సంబంధించి రిజిస్ట్రేషన్ శిక్షణలు, యోగా పోటీలు, గ్రాండ్ ఈవెంట్ల నిర్వహణపై ఆమె సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఎనిమిది లక్షల మందిని నమోదుచేసి యోగాభ్యాసం కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ప్రతీ మండలంలో 40వేల మంది చొప్పున నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. మతాలతో సంబంధం లేకుండా ఆరోగ్యమే పరమావధిగా యోగాభ్యాసనం కార్యక్రమాల్లో ప్రభుత్వ ఆశయ సాధన దిశకు అందరూ కృషి చేయాలన్నారు. క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించకుండా సచివాలయాల్లో కూర్చుని నమోదు ప్రక్రియ చేపడితే పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తమ పేర్లు తమకు తెలియకుండానే నమోదు చేశారని ఆర్టీజీఎస్, ఐవీఆర్ఎస్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందితే సంబంధిత సిబ్బంది పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జూన్ 2 నుంచి 7వరకు మండలస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూన్ 3న అంతర్వేదిలో బీచ్‌లో 2వేల మందితో మెగా ఈవెంట్, యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జూన్ 9న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయం వద్ద, 16న వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించాలన్నారు. ఈవెంట్ల నిర్వహణపై జన సమీకరణపై విశ్వహిందూ పరిషత్, ఓంశాంతి, బ్రహ్మకుమారీలు, ఇస్కాన్, వివిధ స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల సహకారం కోరాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డీఎల్డీవో రాజేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూన్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ

● జిల్లాలో 2.35లక్షల మంది లబ్ధిదారులకు రూ.101కోట్లు విడుదల
● స్పౌజ్ పింఛన్ విడుదల చేయడంలో చంద్రబాబు కృషి ప్రశంసనీయం

అమలాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన మండలం చెయ్యేరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో భాగంగా 12వ నెలకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్ల సొమ్మును చంద్రబాబు నేరుగా అందిస్తారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లను ప్రభుత్వం అందిస్తుంది. జూన్ నెల పింఛన్లకు డాక్టర్ బీఆర్అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,35,860మంది లబ్ధిదారులు రూ.101.16కోట్ల సొమ్మును అందుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 63లక్షల మంది లబ్ధిదారులకు రూ.2,717.90కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. శనివారం కొందరి ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్మును చంద్రబాబు అందించనున్నారు. కొత్తగా స్పౌజ్ పింఛన్ల విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పింఛను పొందే వ్యక్తి చనిపోతే భార్యకు వితంతు పింఛను కోసం దరఖాస్తు ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరుగుతుంది చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పౌజ్ పింఛను విధానాన్ని తీసుకువచ్చింది. ఈవిధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12వ తేదీన 71వేల మందికి స్పౌజ్ పింఛన్లు అందించనుంది. అయితే గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే రెండో నెల పింఛను ఇచ్చేవారు కాదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక మూడు నెలలు పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించింది. లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనమైన ఈవిధానం అమలులోకి రావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెలలో రెండు నెలల పింఛను కలిపి తీసుకునే లబ్ధిదారులు 1,22,975మంది ఉండగా మూడు నెలల పింఛను తీసుకునేవారు 9,176మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.111.41కోట్లను అందజేయనుంది. చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 64లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు 12నెలల కాలంలో రూ.34వేల కోట్లను పేదలకు అందించి ఆర్థిక భరోసా కల్పించడంలో చంద్రబాబు కృషిని ప్రజలు అభినందిస్తున్నారు.

రేషన్ పంపిణీ పండుగలా నిర్వహించాలి

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
● తహశీల్దార్లు, డీలర్ల ప్రతినిధులతో సమీక్ష



తహశీల్దార్లు, డీలర్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డీలర్ల వ్యవస్థను పునఃప్రారంభిస్తున్న సందర్భంగా జూన్ 1న రేషన్ పంపిణీని పండుగలా నిర్వహించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం అన్నారు. మలికిపురం, రాజోలు సఖినేటిపల్లి, మామిడికుదురు తహశీల్దార్లు, డీలర్ల ప్రతినిధులతో జూన్ 1న పంపిణీపై సమీక్షించారు. జూన్ 1న మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేతో, గ్రామాల్లో గ్రామ ప్రతినిధులతో పంపిణీని ప్రారంభించాలన్నారు. పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా డీలర్లు పనిచేయాలన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ప్రభుత్వం భావించిందని, రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారుడు 15రోజుల్లో తనకు వీలున్న రోజున రేషన్ సరుకులు పొందవచ్చన్నారు. తహశీల్దార్లు టి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ప్రసాద్, శరణ్య, సీఎస్ రాజులతో పాటు చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, డీలర్ల ప్రతినిధులు కేవీఎస్ ప్రసాద్, గుబ్బల రామారావు, పెద్దిరాజు, బాలయోగి లత పాల్గొన్నారు.

బాలికల సాధికారత మనందరి బాధ్యత
అంబాజీపేట, మే 30(ఆంధ్రజ్యోతి): కిశోర బాలిక సాధికారత మనందరి బాధ్యతని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్.వెర్నమ్మ అన్నారు. కౌమర దశలో బాలికలందరూ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిశోర వికాశం- వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిరతపూడి, ఇసుకపూడి, కె.పెదపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కిశోర బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన తరువాత మాత్రమే పెళ్లి చేసుకోవాలన్నారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, ఉన్నత విద్య నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలి
ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు

అంబాజీపేట, మే 30(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు సమీకృత వసతి గృహంలో ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. వసతి గృహంలో చేపడుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వసతి గృహానికి రంగులు, మరుగుదొడ్లకు తలుపులు, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, ఫ్లోరింగ్ తదితర పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ఘనంగా అన్నసమారాధన
మామిడికుదురు, మే 30(ఆంధ్రజ్యోతి): మొగలికుదరు గ్రామదేవత శ్రీపళ్లాలమ్మ జాతరను పురస్కరించుకుని భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ నెల20న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఏడు రోజులు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.

'ఉపాధి బకాయి వేతనాలకు సీఎంను కలుస్తాం'



పేరూరులో ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

అమలాపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ వేతన బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధి వేతన బకాయిల విడుదలకు శనివారం సీహెచ్.గున్నేపల్లిలో జరిగే బహిరంగ సభలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. పేరూరులో ఉపాధిహామీ కూలీలను కలుసుకుని శుక్రవారం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకాన్ని నిర్వర్యం చేసే ప్రయత్నంలో భాగంగా కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. జిల్లాలోనే కూలీలకు రూ.60కోట్ల మేర వేతన బకాయిలు విడుదల చేయలేదన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పనులు లేని కాలంలో వ్యవసాయ కూలీలకు ఆరు నెలల పాటు రూ.6వేలు చొప్పున ప్రతీ కుటుంబానికి ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.శివ, జల్లి సీతామహాలక్ష్మి, గుబ్బల పార్వతి,జల్లి దుర్గాభవానీ, ఎన్.రాగరాజు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నదీకోత నివారణకు చర్యలు తీసుకుంటాం



పాశర్లపూడిలోని నదీకోతకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, మే 30(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీతీర ప్రాంతంలో నదీ కోత నివారణకు చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే శుక్రవారం గోదావరిలో బోటుపై వెళ్లి పాశర్లపూడిలో కోతకు గురవుతున్న కొబ్బరి తోటలను పరిశీలించారు. విలువైన సారవంతమైన భూములు నదీ గర్భంలో కొట్టుకు పోతున్నాయని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతనివారణకు గ్రోయిన్ల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నదీ కోత నివారణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, చెల్లుబోయిన శివరామసుబ్రహ్మణ్యం, బళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, గంధం భాస్కర్, తుండూరి బుజ్జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5లక్షలు
ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,02,763 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి
మలికిపురం, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్లకు అర్హులు చాలా మంది ఉన్నారని, వారందరికీ జూన్ 12న రాష్ట్ర ప్రభుత్వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పింఛన్ అందజేయాలని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కోరారు. అర్హతలేనివారు రాజకీయ అండతో పింఛన్లు పొందుతున్నారని, అటువంటి వారిని తొలగించి అర్హులందరికీ అందజేయాలన్నారు. ఆధార్‌కార్డుల్లో తేడాలున్నవాటిని సరిచేసి వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం
రాజోలు, మే 30(ఆంధ్రజ్యోతి): రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాజోలు రోటరీ భవనంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రోటరీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కార్యదర్శి కోదాటి సోమరాజు తెలిపారు. రాజోలులో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మెడ్ యునైటెడ్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. దార్ల పెదబాబు, నామన షణ్ముకేశ్వరరావు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన
రాయవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.విష్ణుకుమారి మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన, బాలికలు ఎదుర్కొనే సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూపర్‌వైజర్ సూచించారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు, కిషోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి



అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ వర్కర్లకు మద్దతు ప్రకటించిన దేవాదుల

అమలాపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న వర్కర్స్ యూనియన్‌కు దేవాదుల శుక్రవారం మద్దతు ప్రకటించారు. టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్‌టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500, విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమ్మె శిబిరంలో యూనియన్ ప్రతినిధులు వై.వెంకటసత్యనారాయణ, గంటి రమేష్, గిడ్డల రమణ, జెట్టి శ్రీనివాస్, మట్టపర్తి కనకరాజేష్, ఐ.భాస్కరరావు, ఎస్.శంకర్, వి.నరేష్, జంగా లోవేశ్వరరావు, సుంకర శ్రీరాములు, జి.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో పోలీసు పికెట్



అంతర్వేది: కొత్తపేటలో కొనసాగుతున్న పోలీసు పికెట్

అంతర్వేది, మే 30(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేది కొత్తపేటలో గురువారం రంగా విగ్రహం ఏర్పాటు నేపథ్యంలో ఇరు సామాజికవర్గాలతో స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆర్డీవో కె.మాధవి, డీఎస్పీ మురళీమోహన్‌లు చర్చలు జరిపి శాంతింప చేశారు. అయితే పోలీసు పికెట్ మాత్రం ఇంకా కొనసాగుతుంది. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. శుక్రవారం కూడా పోలీసు బృందాలు కొత్తపేట సమీప ప్రాంతంలో బందోబస్తు నిర్వహించారు. జిల్లాలో సీఎం పర్యటన ఉండడంతో రంగా విగ్రహం ప్రారంభోత్సవం వాయిదా పడడంతో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

'ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న జనసైనికులు

పి.గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో వైనతేయనదీ తీరాన వేంచేసి ఉన్న శ్రీపట్టాభి రామస్వామి ఆలయం ఎదుట ఉన్న హోమశాల విషయంలో ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగవని లంకలగన్నవరం జనసైనికులు హెచ్చరించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణపై కృష్ణ ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకుడు కేడీఆర్ చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తూ ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రామాలయం ఎదుట అన్నక్యాంటీన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే చర్యలు చేపడుతున్నారని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అన్నక్యాంటీన్ అనేది అధికారుల పరిశీలనలో భాగమని ఎమ్మెల్యేకు ఏవిధమైన సంబంధం లేదన్నారు. ఇటీవల పలువురు భక్తులు ఎమ్మెల్యే వద్దకు రాగా పూర్తిగా సహకరిస్తానని చెప్పారని గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అన్ని వర్గాలను సమానంగా చూస్తున్న ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో అసత్యఆరోపణలు చేస్తూ పోస్ట్ చేయడం దురదుష్టకరమన్నారు. ఎమ్మెల్యేపై చేసిన అసత్య వ్యాఖ్యలను కేడీఆర్ వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరమణ, చిట్టాల పెద్దజోగేశ్వరరావు, గనిశెట్టి శ్రీనివాసరావు, యర్రంశెట్టి రామకృష్ణ, పల్లి శ్రీను, గూటం కృష్ణంరాజు, యన్నపు బాబి, యన్నాబత్తుల సతీష్, శేరు పోతురాజు, యర్రంశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

అహల్యాబాయ్‌తో సామాజిక సమానత్వం



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా

పి.గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): అహల్యాబాయ్ న్యాయం, ధర్మం, సామాజిక సమానత్వానికి గొప్ప ఉదాహరణగా చెప్పుకోవచ్చునని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అన్నారు. బెల్లంపూడిలో జరిగిన అహ ల్యాబాయ్ జయంతి వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారా యణ అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తొలుత అహల్యాబాయ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చీకరమిల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి శేషారావు, ఆదిమూలం వెంకటేశ్వరరావు, అడ్డాల వెంకటేశరరావు, మేడిది సత్యనారాయణ, దిరిశాల సుధాకర్, యర్రంశెట్టి తాతారావు, కుడిపూడి సూర్యనారాయణ, కోటి శివాజి, కోలా గోపాలకృష్ణ, దిగుమర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనులపై సీఎం స్పందించాలి
కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు



కోనసీమ జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

అమలాపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు పేర్కొన్నారు. శనివారం ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనులపై స్పందించాలని ఆయన సూచించారు. కన్వీనర్ రామ్మోహనరావు అధ్యక్షతన శుక్రవారం అమలాపురంలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కోటిపల్లి గౌతమీ నది వద్ద రైల్వే బ్రిడ్జిపై గడ్డర్స్ వేయడానికి రెండేళ్ల క్రితం టెండర్లు ఖరారు అయినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. సమావేశంలో కల్వకొలను బాబు, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, సీలి సంసోను, మాచిరాజు నాగేశ్వరరావు, జంగా రాజేంద్ర, బాలనాగు, సురాజ్, ఈతకోట సూర్య, కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకే జంగిల్ క్లియరెన్స్
తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఎస్ఈ రాజబాబు

అమలాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల పరిధిలో విద్యుత్ లైన్లు వెంబడి ఉన్న చెట్ల కొమ్మలు, ఆకులను తొలగిస్తున్నట్టు తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ ఎస్ఈ రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరచూ చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలపై పడడంవల్ల సరఫరాకు అంతరాయం కలగడంతోపాటు లైన్లు ట్రిప్ అయి ఎన్నో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దీని దృష్ట్యా వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేసేందుకు జంగిల్ క్లియరెన్సు జరుగుతుందని వివరించారు. ఉప్పలగుప్తం, ముమ్మిడివరం కాట్రేనికోన మండలాల్లో విద్యుత్ తీగలకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు, కొబ్బరి ఆకులు, ఇతర పాదులను తొలగించామని, ఇది సాధారణంగా విద్యుత్ సరఫరా నిర్వహణలో భాగంగా జరిగే కార్యక్రమమని ఆయన వివరించారు. కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులు ఖండించారు.

బెల్లం ఊట ధ్వంసం
ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆత్రేయపురం మండలం పేరవరంలో శుక్రవారం సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో గోదావరిలంకలో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెజవాడ సత్తియ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేప చెట్టు నరికివేతపై ఫిర్యాదు
ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): క్రాపచింతలపూడిపాలెంలో పంచాయతీ స్థలంలో ఉన్న ఒక వేపచెట్టును సరిహద్దు రైతు అయినవిల్లి మండలం కొండుకురుకు చెందిన సుందరనీడి పట్టాభిరామయ్య ఈనెల25న నరికించి విక్రయించాడని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పంచాయతీ ఆస్తిని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కోరారు.

దేవాలయాల పునరుద్ధరణ చేసిన ధీరవనిత హోల్కర్



మామిడికుదురు మహిళా సమాఖ్య కార్యాలయంలో అహల్యాబాయ్ హోల్కర్ చరిత్ర వివరిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమా

మామిడికుదురు, మే 30(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ఆసేతు హిమాచలం వరకు పునరుద్ధరణ చేసిన ధీర వనిత అహల్యాబాయ్ హోల్కర్ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎ వేమా పేర్కొన్నారు. శుక్రవారం మామిడికుదురులోని మహిళా సమాఖ్య భవనంలో హోల్కర్ జయంతి సందర్భంగా బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన ఆమె జీవిత చరిత్రకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం హోల్కర్ పేరిట స్త్రీశక్తి పురస్కారాన్ని ఏర్పాటు చేసిందన్నారు. దూర దృష్టి, ధర్మరక్షణ, సేవా, సుపరిపాలన, సామాన్య సంస్కరణలు తదితర వంటి వాటిలో ఆరితేరిన మహోన్నత పుణ్యమూర్తి హోల్కర్ అని కొనియాడారు. పార్టీ నాయకులు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, అడపా వెంకటరత్నం పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
అంతర్వేది, మే 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామం పంచాయతీ వద్ద యోగాంధ్రలో భాగంగా సర్పంచ్ కొండా జాన్‌బాబు అధ్యక్షతన యోగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. యోగా ప్రాముఖ్యతను వివరించి ఆసనాలు, ప్రాణాయామం చేయించారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని యోగా గురువు మన్నే సత్యనారాయణ తెలిపారు. మన్నే సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






నార్కెడిమిల్లిలంకలో కోసిన మొక్కజొన్న పంట. పక్క చిత్రంలో నార్కెడిమిల్లి గోదావరిలో పంటను తీసుకు వస్తుండగా మునిగిన ట్రాక్టర్

లంకదాటి బయటకు తెచ్చేదెలా?

• మునిగిపోయిన పాటిరేవు • ఆందోళనలో మొక్కజొన్న రైతులు

ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): లంక గ్రామంలో కష్టించి పండించిన మొక్కజొన్న పంట బయటకు వచ్చే మార్గం లేక లంక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువన వర్షాలు కురవడంతో గోదావరి నదిలోకి వరద నీరు చేరుతోంది. దీంతో రైతులు సాగు చేసుకున్న పంట బయటకు వచ్చే మార్గం లేక కలవరపడుతున్నారు. నార్కెడిమిల్లి లంకలో సుమారు 60 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికి రావడంతో గ్రామానికి తరలించేందుకు వారు సిద్ధమయ్యారు. ఇటీవల వాతావరణం అనుకూలించకపోవడంతో పలుచోట్ల ముంపుబారిన పడింది. గోదావరి ఎగువన వర్షాలు కురవడంతో నదిలోకి నీరు చేరుకుంది. కాటన్ బ్యారేజీ విజ్జేశ్వరం, మద్దూరు, ఆర్మ్‌ల వద్ద నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో మొక్కజొన్న పంట బయటకు రావడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా పంటను బయటకు తీసుకు వచ్చేందుకు ఎంత ప్రయత్నించినా నీటిలో దిగబడిపోతున్నాయి. ఇటీవల ఈ విషయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. హెడ్‌వర్క్స్ అధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించడం ద్వారా తమ పంట బయటకు వస్తుందని రైతులు సూచిస్తున్నారు. కష్టపడి పండించిన పంట బయటకు వచ్చే మార్గం చూడాలని, లేని పక్షంలో తీవ్రంగా నష్టపోతామని రైతులు జిల్లా అధికారులను వేడుకుంటున్నారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

కె.గంగవరం, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 1న ఆయా గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్ద పండుగ వాతావరణంలో రేషన్ పంపిణీ చేయాలని డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, మురళి అన్నారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి మండలంలోని ఆయా రేషన్ దుకాణాలను తనిఖీలు చేశారు. దుకాణాల వద్ద తూనిక యంత్రాలు, పని చేస్తున్న విధానం, స్టాకు వివరాలను వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో టి.శ్రీరామచంద్రమూర్తి, ఆర్ఐ వెంకట్రావు, ఆయా గ్రామాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, ఆర్ఐ

రేషన్ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

కపిలేశ్వరపురం, మే 30(ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా సరుకులను వినియోగదారులకు అందజేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మండల రేషన్ డీలర్లు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండపేట కార్యాలయంలో మండల రేషన్ డీలర్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్డుదారులందరికీ చౌక బియ్యం అందించేందుకు డీలర్లు కృషి చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే రేషన్ డోర్ డెలివరీ జరుగుతుందని తెలిపారు. బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు సీహెచ్ కొండబాబు, వి.సుబ్బారావు, కె.విజయ్‌కుమార్, ఎం.వెంకటరమణ, ఎం.రామకృష్ణయ్య, దుర్గాభవాని, సాదె శ్రీదేవి, పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖలోని కాంట్రాక్ట్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

మండపేట, మే 30(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం 7వరోజు వారు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తమకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి.సుబ్బరాజు, ఎస్.సంతోష్, ఎం.రమేష్, తలాటి వెంకన్న, పిట్లా ప్రవీణ్, గంటి నవీన్ కుమార్, వి.వాసు, కె.సురేంద్ర, కె.అన్నవరం, ఎం.గన్నియ్య, కె.వేంకటేశ్వర్లు, జి.ప్రసాద్, ఎస్.భాస్కరరావు, టేకి వెంకన్న బాలరాజు, సురేష్, పి.కన్నా తదితరులు పాల్గొన్నారు.



చీమలదిబ్బ వద్ద ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు, గ్రామస్తులు

ఇసుక లారీలతో భయాందోళన చెందుతున్నాం

వేగాయమ్మపేట, వెంకటాయపాలెం గ్రామస్తుల ధర్నా

ద్రాక్షారామ, మే 30(ఆంధ్రజ్యోతి): ఇసుక లారీల వేగంతో భయాందోళన చెందుతున్నామని నిరసన తెలిపారు. శుక్రవారం చీమలదిబ్బ వద్ద వేగాయమ్మపేట, వెంకటాయపాలెం సర్పంచ్‌లు, గ్రామస్తులు, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిపారు. వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు అంబటి తుకారాం, యల్లమల్లి సతీష్‌కుమారి, రైతుకూలీ సంఘం నాయకుడు వెంటపల్లి భీమశంకరం తదితరులు మాట్లాడారు. చీమలదిబ్బ వద్ద ఇసుక లారీలు మితిమీరిన వేగంతో వెళుతుండటంతో తరచూ ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. బుధవారం ఒక మహిళ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా కాలువగట్టు ఉండటంతో రోడ్డు కుంగిపోతోందన్నారు. అధికలోడుతో వెళ్లే వాహనాల రాకపోకలను అధికారులు కట్టడి చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో చీమలదిబ్బ గ్రామస్తులు అనుసూరి వెంకటరమణ, ఇళ్ల సత్యనారాయణ, ఇళ్ల గణపతి, కోడి అర్జునుడు, మాజీ ఎంపీటీసీ దడాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.02 లక్షలు

ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,02,763 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రదక్షిణలు చేసి స్వామివారి మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో ర్యాలి గోపాలస్వామి

వచ్చేనెల 6 నుంచి గోపాలస్వామి కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ క్షేత్ర పాలకుడు గోపాలస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు జూన్ 6వ తేదీ నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి రమణమూర్తి తెలిపారు. జూన్ 6న సాయంత్రం 6 గంటలకు అంకుర్పారణ, ధ్వజారోహణం, స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. వచ్చేనెల 8న సదస్యం, 11న పూర్ణాహుతి, చక్రస్నానం, 12న పుష్పోత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. స్వామివారి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

గోదావరిలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మండపేట, మే 30(ఆంధ్రజ్యోతి): గోదావరిలో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. గోదావరి రేవుల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల జిల్లాలో జరిగిన పలు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

మండపేట మే, 30(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజా పరిష్కార వేదిక ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ మండపేట కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.



రావులపాలెంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రావులపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వరమే సంబంధిత అధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు.

ఐదేళ్ల విధ్వంసానికి గుర్తుగా వైసీపీ ప్రాయచిత్త దినం జరుపుకోవాలి

రావులపాలెం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు అధికారాన్ని కట్టబెడితే వారిని అభివృద్ధిపథంలోకి నడిపించకపోగా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులు ప్రాయచిత్త దినం జరుపుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. భవిష్యత్‌పై నమ్మకంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారన్నారు. మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతంగా జరగడంతో పాటు సిట్ అధికారులు ఈ కేసులో సంబంధం ఉన్నవారిని అరెస్టు చేస్తుండటంతో జగన్ ఉలికిపడుతున్నారన్నారు. ఐఏఎస్ అధికారుల సైతం జైలుకు వెళ్లాల్సిన పరిస్థితికి కారణం వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, సీఎం చంద్రబాబు, లోకేశ్‌ను విమర్శించడంతో పాటు ఆధారాలు లేకుండా తనపై విమర్శలు చేస్తూ ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తుంటారన్నారు. అర్థంపర్థం లేని ఆరోపణలపై స్పందించే అవసరం తనకు లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపచెట్టు నరికివేతపై ఫిర్యాదు

ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): క్రాపచింతలపూడిపాలెంలో పంచాయతీ స్థలంలో ఉన్న ఒక వేపచెట్టును సరిహద్దు రైతు అయినవిల్లి మండలం కొండుకురుకు చెందిన సుందరనీడి పట్టాభిరామయ్య ఈనెల 25న నరికించి విక్రయించారు. దీంతో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

రాయవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో మాట్లాడుతూ పింఛన్లను ఉదయం 7 గంటల నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సిబ్బంది వెళ్లి పింఛన్లు అందజేస్తారని తెలిపారు.

నియోజకవర్గానికి గోదావరినీళ్లు తెస్తా

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు. చిత్రంలో హాజరైన సభ్యులు, చైర్‌పర్సన్ రాణి

మండపేట మే, 30(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణానికి మంచినీటి సరఫరా కోసం ఏడాదికి రూ.7.7 కోట్లు వెచ్చించటం వల్ల మున్సిపాల్టీకి అదనపు భారం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అజెండాలో పొందుపరిచిన 60 అంశాలను ఆమోదించగా 56వ అంశాన్ని పునః సమీక్షించాలని తీర్మానించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా పట్టణానికి గోదావరి జలాలపై జరిగిన అంశాలను గుర్తు చేశారు. గోదావరి జలాలు ఆరోగ్యకరమైనవని, నియోజకవర్గానికి వాటిని తీసుకు వస్తామన్నారు.

ప్రజా ప్రతినిధులంటే లెక్కలేదు: మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు ప్రజా ప్రతినిధులన్నా, కౌన్సిల్ అన్నా గౌరవం లేకుండా పోయిందని పలువురు సభ్యులతో సహా ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే వేగుళ్ల, వైసీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మున్సిపాల్టీకి సంబంధించి వాటర్ వర్క్సుకు చెందిన స్థలం అన్యాక్రాంతమైన సంఘటనపై సమావేశంలో వాడివేడిగా చర్చ సాగింది. గతంలో సర్వే నిర్వహించగా సుమారు 18 సెంట్లమేర ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైందని సర్వేలో వెల్లడైందని కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ఆరోపించారు. ఆక్రమించిన వ్యక్తికి అధికారులు, పట్టణ ప్రణాళిక సిబ్బంది కొమ్ముకాశారని ఆయన ఆరోపించారు. పట్టణంలో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని పలువురు సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని టీడీపీ కౌన్సిల్ చుండ్రు చినసుబ్బారావు చౌదరి అన్నారు. పట్టణంలో క్రైస్తవుల కోసం కాల్వ వద్ద నిర్మించే పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. క్రైస్తవుల తరపున వైసీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ కౌన్సిల్‌కు, ఎమ్మెల్యే వేగుళ్లకు ధన్యవాదాలు తెలిపారు. శెట్టిబలిజ కల్యాణ మండపానికి ఏసీలు మంజూరు చేసిందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

కరెంట్ సమస్యను పరిష్కరించాలి: గొల్లపుంతకాలనీలో వున్న టిడ్కో సముదాయంలో ఒక బ్లాకుకు నెల నుంచి విద్యుత్ సరఫరా లేదని, దానివల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సత్వరమే సమస్య పరిష్కరించే బాధ్యతను అధికారులు తీసుకుని పరిష్కరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశించారు. కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించి అమోదించారు. సమావేశంలో చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌లు వేగుళ్ల నారయ్యబాబు, కమిషనర్ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగా చేస్తున్న ఉద్యోగులు



మండపేటలో యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, ప్రజలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

మండపేట, మే 30(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పదిలమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం మండపేట-ఆలమూరు రోడ్డులో వున్న కన్వెన్షన్ హాలులో యోగా గురువు రఘు, ఆయన శిష్యులు యోగా ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, పట్టణ ప్రజలు భారీగా హాజరయ్యారు. యోగా అనంతరం గురువులను సత్కరించారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతీవాడ నూకదుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ రంగారావు, డీఈఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు గ్రామాల ఉద్యోగులు శిక్షణ తీసుకున్నారు. ముందుగా వారితో యోగాను చేయించి వాటి ప్రయోజనాలు తెలిపారు. శిక్షణ పొందిన ఉద్యోగులు గ్రామాల్లో ప్రజలతో యోగా చేయించి దాని ప్రాముఖ్యత వివరించాలని ఎంపీడీవో ఎ.రాజు, మండల పరిషత్ ఏవో మోహార్‌ప్రకాష్ సూచించారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మహిళా సమాఖ్య భవనంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించగా, యోగా అభ్యాసకులు శిక్షణ ఇచ్చారు. అధికారులకు సుమారు రెండు గంటల పాటు యోగా తరగతులు నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో కళాశాల పీడీ కె.కనకరాజు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో బీహెచ్ సాయిబాబా, సీహెచ్ నాగసూర్యారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. కొత్తపేట స్వామి వివేకానంద యోగాశ్రమం 9వ వార్షికోత్సవాన్ని యోగా గురువు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా గురువు మోటూరి భైరవస్వామిని సత్కరించారు.



కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు

అభివృద్ధి పనులపై అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని శివాలయం పార్కు సమీపంలో సీఎస్ఆర్ నిధులతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన చెలికాని రామారావు సమావేశ మందిరంలో జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ 23వ వార్డులో రైతుబజార్ నిర్మించిన ప్రాంతంలో పిరమిడ్ ధ్యానకేంద్రం, ఓపెన్ ఎయిర్ జిమ్, నెట్ క్రికెట్, వాకింగ్ ట్రాక్, మహిళలు వ్యాపారాలు చేసేందుకు షాపింగ్ నిర్మాణానికి మంత్రి సుభాష్ రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టేందుకు ప్రతిపాదించారని తెలిపారు. దీనిపై వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, పెంటపాటి దేవి, గుబ్బల లక్ష్మీగణపతిరావు తదితరులు మాట్లాడుతూ చెరువు ప్రాంతమని ఆ ప్రదేశంలో కట్టడాలకు అనుమతులు రావని అభ్యంతరం తెలిపారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌తో అనుమతులు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనుమతులు తీసుకున్న తరువాత కౌన్సిల్ ఆమోదిస్తామని అధికారపక్ష సభ్యులు పేర్కొనడంతో ప్రతిపక్ష సభ్యుడు అంకం శ్రీనివాస్, అధికారపక్ష సభ్యుల మధ్య వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. ఎజెండాలో పేర్కొన్న పలు అంశాలను కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదించారు. పట్టణంలో ఇటీవల దోమల బెడద పెరిగిపోయిందని జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి



వెదురుపాకలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

రాయవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక, మాచవరం గ్రామాల్లో సీఐటీయూ ఆవిర్భావాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి ఆయా గ్రామాల్లో సీఐటీయూ పతాకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కార్మికులు ఐక్యతతో పోరాటాలు సాగించడం ద్వారా హక్కులు సాధించుకోవచ్చునన్నారు. జూలై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ సత్యవేణి, ఎస్.శ్రీసత్య, కె.కమల, ఈ.వెంకటలక్ష్మి, పుష్ప, ఆశావర్కర్లు జి.దుర్గ, కె.అనంతలక్ష్మి, అంగ్‌వాడీ హెల్పర్లు, మధ్యాహ్న భోజనం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన

రాయవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.విష్ణు కుమారి మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కిశోరి బాలికలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూపర్‌వైజర్ సూచించారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు వాటి వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.



పసలపూడిలో కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి వనువులమ్మ జాతర

కపిలేశ్వరపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): కేదార్లంకలో ఉన్న వనువులమ్మ అమ్మవారి జాతర శనివారం నుంచి ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గరగనృత్యాలు, విచిత్ర వేషాలు, డప్పువాయిద్యాలు, బాణసంచా మధ్య అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఆదివారం ఆలయం వద్ద తీర్థం జరపనున్నట్లు వారు తెలిపారు.



పేరవరంలో బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బెల్లంఊట ధ్వంసం

ఆత్రేయపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరంలో శుక్రవారం సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో గోదావరిలంకలో సారా తయారీ స్థావరాలపై దాడులు జరిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెజవాడ సత్తియ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎఈఎస్ అమర్‌బాబు, సీఐ కేఎస్ చంద్రశేఖర్, ఎస్ఐలు అన్నవరం, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవహక్కుల కమిషన్ కౌన్సిలింగ్‌తో ఒక్కటైన దంపతులు

ఆలమూరు, మే 30(ఆంధ్రజ్యోతి): జాతీయ మనవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) ఆధ్వర్యంలో విడిగా ఉంటున్న దంపతులకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో ఒక్కటైన ఘటన బడుగువానిలంకలో జరిగింది. జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపళ్లకు చెందిన దేవిగౌతమి, బడుగువానిలంకకు చెందిన పాలూరి వెంకటేష్‌కు 2014లో వివాహమైందన్నారు. మూడో కాన్పులో ఆడపిల్ల జన్మించిందన్న నెపంతో భర్త వెంకటేష్ మూడేళ్ల క్రితం భార్యను పుట్టింటికి పంపించారన్నారు. ఇటీవల వారిద్దరిని పలుసార్లు సమావేశపరిచి కౌన్సిలింగ్ చేయడంతోపాటు ఇరు కుటుంబాల పెద్దలతో చర్చించామన్నారు. చర్చలు ఫలించడంతో భార్యను, పిల్లలను తీసుకెళ్లడానికి ఒప్పుకోవడంతో గురువారం రాత్రి బడుగువానిలంకకు తీసుకెళ్లి పెద్దల సమక్షంలో వారికి అప్పగించామన్నారు.